
సాక్షి
బాపట్ల
ఆదివారం । 25 । ఆగస్టు । 2024



## అమ్మవారికి సారె సమర్పణ

సత్తెనపల్లి: పట్టణంలోని త్రిశక్తి దుర్గాపీఠం వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం అమ్మవారికి సారె సమర్పించారు. మహిళలు మొక్కులు తీర్చుకున్నారు.



## సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 589.80 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 9,076 క్యూసెక్కులు వదిలారు.



## కృష్ణాష్టమి వేడుకలు

వెల్దుర్తి: మాచర్ల పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో శనివారం ముందస్తు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. ఉట్టికొట్టే కార్యక్రమంలో చిన్నారులు పాల్గొని సందడి చేశారు.

## 27 నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి టెన్త్ వరకు చదువుతున్న విద్యార్థులకు సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్–1 పరీక్షలు ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉమ్మడి పరీక్షా మండలి ఆధ్వర్యంలో పాఠశాలలకు ప్రశ్నపత్రాలను సరఫరా చేయనున్నట్లు చెప్పారు. 1 నుంచి 8వ తరగతి వరకు ఓఎంఆర్‌తో ఉంటాయన్నారు. సీబీఎస్‌ఈ పాఠశాలలకూ సరఫరా చేస్తామని తెలిపారు. ఈ నెల 26న మండల విద్యా వనరుల కేంద్రాలకు వాటిని చేరవేస్తామని పేర్కొన్నారు. మండలస్థాయి కమిటీ పాఠశాలలకు రోజూ పరీక్షకు గంట ముందుగా పంపిణీ చేయాలని పేర్కొన్నారు.



### ● కట్టుదిట్టమైన భద్రత ఉండాలి



నిత్యం రోగుల ప్రాణ రక్షణలో ఉండే వైద్యుల భద్రత కట్టుదిట్టంగా ఉండాలి. వైద్యులకు కేటాయించే గదులు గట్టి బందోబస్తుతో ఉండాలి. వైద్యుల గదుల తలుపు పక్కన కిటికీ ఉంటే ఎవరు తలుపుకొడుతున్నారో ఇట్టే తెలిసిపోతుంది. రాత్రిళ్లు ఈ విధానం వలన ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ఏదైనా అనుకోని ఘటన జరిగితే పోలీసులకు సమాచారం అందేవిధంగా వైద్యులకు అందుబాటులో ఒక అలారం ఏర్పాటు చేయాలి. ఆస్పత్రుల్లోని అన్ని విభాగాలు కవర్ చేసేటట్లు సీసీ కెమెరాలు అందుబాటులో ఉండాలి. సెక్యూరిటీ గార్డుల సంఖ్య పెంచాలని ఉన్నతాధికారులకు తెలియజేశాం.

– డాక్టర్ సుభాషిణి, సూపరింటెండెంట్, ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల, చీరాల

### ● బలమైన చట్టాలు తేవాలి



ప్రభుత్వ ఆస్పత్రులలో పనిచేసే వైద్యులకు అన్నిరకాల సదుపాయాలతోపాటు రక్షణ పరంగా చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం ప్రత్యేకంగా చట్టాలు చేయాలి. కళాశాలలో ఉన్నప్పుడు కో–ఎడ్యుకేషన్ పేరుతో వైద్య విద్యార్థులందరికీ ఒకే చోట వాష్ రూంలు ఉండేవి. ఆస్పత్రుల్లో అలాకాకుండా వైద్యులకు ప్రత్యేకంగా వసతులు కల్పించాలి. రాత్రిళ్లు విధుల్లోఉన్న మహిళా వైద్యులకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రధానంగా రోగుల సహాయకులు మద్యం, ఇతరత్రా మత్తుపదార్థాలు సేవించి వస్తున్నారు. వారినుంచి రక్షణ కల్పించేందుకు ఆస్పత్రుల్లో ప్రత్యేకంగా పోలీసులను నియమించాలి. సీసీ కెమెరాలు నిత్యం పనిచేసేలా చూడాలి.

– డాక్టర్ వహిలా చౌదరి, సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు, అద్దంకి

# గర్జించిన విద్యార్థి లోకం

- కోల్‌కతా ఘటనపై కొల్లూరులో సీఐటీయూ, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన
- బస్టాండ్ సెంటర్‌లో మానవహారం

కొల్లూరు: సేవ్ గాళ్స్.. సేవ్ ఇండియా.. ఉయ్ వాంట్ జస్టిస్ నినాదాలతో కొల్లూరు గ్రామం మారుమోగింది. ఎన్నాళ్లీ అమానవీయ ఘటనలు.. ఇంకెంత కాలం ఇటువంటి రాక్షస క్రీనీడలు అంటూ విద్యార్థిలోకం ఎలుగెత్తి చాటింది. కోల్‌కతా ఘటనలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన ఘోరం మరొకరికి జరగకుండా నిందితులకు సత్వరమే కఠిన శిక్షలు అమలు చేయాలని నినదించింది. ఘోర హత్యాచారానికి గురైన వైద్యురాలికి మద్దతుగా శనివారం ప్రజాసంఘాలు, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కొల్లూరులో ప్రదర్శన నిర్వహించారు. శ్రీచైతన్య, శ్రీసాయివాసవి విద్యా సంస్థల విద్యార్థులతోపాటు, జీవీఎస్ఆర్ అండ్ ఎస్ఏఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు వైద్యురాలిపై జరిగిన పాశవిక చర్యను వ్యతిరేకిస్తూ ఆంధ్రా బ్యాంక్, స్టేట్ బ్యాంక్ రోడ్లతోపాటు, ప్రధాన రహదారిలో నినాదాలను హోరెత్తిస్తూ నిరసన చేపట్టారు. అనంతరం బస్టాండ్ సెంటర్లో మానవహారంగా ఏర్పడి వైద్యురాలి మృతికి సంతాపం తెలపడంతోపాటు, నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని నినాదాలు చేస్తూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



కొల్లూరులో నిరసన ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

### సత్వర విచారణ.. కఠిన శిక్షలతోనే..

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొనిగల సుబ్బారావు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పి.మనోజ్‌కుమార్‌లు మాట్లాడుతూ, కఠినమైన చట్టాలను రూపొందించి, కోర్టుల ద్వారా విచారణ జరిపి వెంటనే శిక్షలు ఖరారు చేసినప్పుడు మాత్రమే ఇటువంటి ఘటనలు పునరావృతం అవకుండా ఉంటాయని అన్నారు. మహిళల రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయడంతోపాటు, పని ప్రదేశాలలో మహిళలకు అవసరమైన భద్రత చర్యలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అభిషేక్, చైతన్య, విద్యాసంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

## శాంతియుత మార్గమే సన్మార్గం

● సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

రేపల్లెరూరల్: ప్రతి ఒక్కరూ శాంతియుత మార్గాన్ని ఎంచుకుని సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు చెప్పారు. పట్టణంలోని సబ్ జైల్‌లో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రిమాండ్ ఖైదీలకు శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. క్షణికావేశంలో చేసిన తప్పిదాలకు తమతో పాటు తమ కుటుంబ సభ్యులు సైతం ఇబ్బందులపాలు కావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. దీంతో జీవితాంతం బాధలు పడాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. ఇకనుంచైనా పగలు, ప్రతీకారాలను వీడి శాంతియుతంగా జీవించాలని సూచించారు. అనంతరం జైలులో ఖైదీలకు అందుతున్న వసతులపై ఆరాతీశారు. వివిధ రకాల చట్టాలను వివరించారు. ప్యానల్ న్యాయవాది కె.శ్రీనివాసరావు, సబ్ జైలు సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు ఉన్నారు.

## డయేరియాపై అవగాహన అవసరం



విద్యార్థినులతో డయేరియాపై అవగాహన ప్రదర్శన

వేమూరు: డయేరియా వంటి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జలజీవన్ మిషన్ జిల్లా కో–ఆర్డినేటర్ పి.తేజ సంగీత్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డయేరియాపై అవగాహన సదస్సు, ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తేజ సంగీత్ మాట్లాడుతూ అతిసారా సోకినపుడు ఓఆర్ఎస్ ద్రావణం తీసుకుని, వైద్యులను సంప్రదించాలన్నారు. సీజనల్ వ్యాధులు సోకుండా విద్యార్థులను ఎప్పటికప్పుడు చైతన్యం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల హెచ్ఎం పద్మజ, రంగారావు, పున్నారావు పద్మభాయ్ పాల్గొన్నారు.

**కొల్లూరులో...**

కొల్లూరు: డయేరియా వ్యాప్తిని అరిట్టడానికి పరిశుభ్రమైన నీటిని తాగాలని ముఖ్యమని జల్ జీవన్ మిషన్ జిల్లా ఐఎస్ఏ కో–ఆర్డినేటర్ టి.రంగారావు పేర్కొన్నారు. శనివారం కొల్లూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు డయేరియా నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. నీటిని వృథా చేయకుండా సంరక్షించుకునే బాధ్యతను ప్రతి ఒక్కరూ స్వీకరించాలన్నారు. గోరువెచ్చని నీటిని తాగడం ద్వారా జీర్ణక్రియ సక్రమంగా పనిచేస్తుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. కమ్యూనిటీ హెల్త్ అధికారిణి జ్యోతి మాట్లాడుతూ అతిసారకు గురైనప్పుడు అజాగ్రత్త చేయకుండా ఓఆర్ఎస్ ద్రావణం తాగాలన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతను వివరించారు. ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ ఉషాకుమారి, ఏఎన్ఎం ఉమ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఉమా మహేశ్వరి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రదర్శన నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు.

## సామూహిక షష్టిపూర్తి మహోత్సవం

**షష్టిపూర్తి మహోత్సవం జరుపుకొన్న 111మంది దంపతులు**



షష్టిపూర్తి మహోత్సవంలో దంపతులు

కర్లపాలెం: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సామూహిక షష్టిపూర్తి మహోత్సవం జరుపుకోవటం అభినందనీయమని చీరాల ఎమ్మెల్యే ఎం.మాలకొండయ్య తెలిపారు. బాపట్ల జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం కర్లపాలెం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సామూహిక షష్టిపూర్తి మహోత్సవాలు నిర్వహించారు. ఈ మహోత్సవంలో మొత్తం 111మంది దంపతులు శాస్త్రోక్తంగా షష్టిపూర్తి జరుపుకొన్నారు. తొలుత వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం షష్టిపూర్తి మహోత్సవం జరిగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాలకొండయ్య మాట్లాడుతూ ఆర్యవైశ్యులందరూ ఒకేచోట షష్టిపూర్తి జరుపుకోవటం ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ మాట్లాడుతూ సామూహిక షష్టిపూర్తి మహోత్సవాలతో పండుగ వాతావరణం నెలకొందని ఈ ఘనత జిల్లా అధ్యక్షుడు తూనుగుంట్ల శ్రీనివాసరావుకు దక్కుతుందని చెప్పారు.

## చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

**బాపట్ల డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రామాంజనేయులు**



**బాపట్లటౌన్:** చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని డీఎస్పీ జి.రామాంజనేయులు తెలిపారు. బాపట్ల డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న సిహెచ్ మురళీకృష్ణ ఇటీవల బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. ఈక్రమంలో బాపట్ల డీఎస్పీగా నూతనంగా నియమితులైన బి.రామాంజనేయులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. డీఎస్పీ రామాంజనేయులు 1989 బ్యాచ్‌కు చెందిన అధికారి. 2014లో డీఎస్పీగా పదోన్నతి పొందారు. గుంటూరు స్పెషల్‌బ్రాంచ్ డీఎస్పీ, మంగళగిరి డీఎస్పీగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రకాశం జిల్లాకు చెందిన రామాంజనేయులు చీరాలలోని వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలో డిగ్రీ చదువుకున్నారు. తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో ఎంఎస్సీ పూర్తిచేశారు. బాపట్ల పరిసర ప్రాంతాలపై పూర్తి అవగాహన ఉందని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రోత్సహించినా అటువంటివారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

## క్రెడిట్ కార్డు నుంచి నగదు మాయం

**యద్దనపూడి:** యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామానికి చెందిన కంచపు అంకమ్మ నూడిల్స్ పాయింట్ పెట్టుకొని జీవనోపాధి పొందుతున్నాడు. ఆర్బీఎల్ బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని మీ క్రెడిట్‌కార్డును లిమిట్ ఎక్స్‌టెన్షన్ చేస్తున్నామని శుక్రవారం అంకమ్మరావు ఫోన్ వచ్చింది. అందుకు మీకొక లింక్ పంపిస్తున్నామని దానిని అప్‌డేట్ చేసుకోవాలని సూచించటంతో అంకమ్మరావు ఆ లింక్‌ను క్లిక్ చేశాడు. దీంతో ఫోన్ మొత్తం హ్యాక్ అయి అతని ఖాతాలో ఉన్న నగదు డ్రా చేస్తున్నట్లు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో కంగారుపడ్డ అంకమ్మరావు బ్యాంకుకు ఫోన్ చేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. మొత్తం 2 గంటల పాటు ఫోన్ పనిచేయడం ఆగిపోయింది. ఇలా తన క్రెడిట్ కార్డు నుంచి రూ.40 వేలు నగదు డ్రా అయినట్లు తెలుసుకొని వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం స్థానిక పోలీసులను కూడా ఆశ్రయించి తనకు న్యాయం చేయాలని అభ్యర్థించాడు.

## ప్రతి ఒక్కరి విజయం వెనుక దేవుని కృప

**తాడేపల్లి రూరల్:** జీవితంలో స్థిరపడిన ప్రతి ఒక్కరి విజయం వెనుక భగవంతుడి కృప ఉంటుందని, అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న అని రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి గుంటూరు జిల్లా తాడేపల్లి రివర్ బ్రీజ్ అపార్ట్‌మెంట్ వాసులు నన్నపనేని శివన్నారాయణ, అరుణ, దద్దనాల సూర్యనారాయణరావు, అనిత దంపతుల ఇంట్లో జరిగిన విజయేంద్ర-రమ్యతేజల వివాహం సందర్భంగా 10 టన్నుల కూరగాయలను విరాళంగా అందించారు. శనివారం ఎస్. ఢిల్లీరావు ఈ కూరగాయల వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తితిదే సేవల్లో భాగస్వాములయ్యే అవకాశం అందరికీ ఉందన్నారు. ఈ మహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించిన మండవ కుటుంబరావు ఆశయాలను కొనసాగిస్తున్న నాగేంద్రను అభినందించారు. మానవ సేవ చేస్తే మాధవ సేవ చేసినట్లేనని, జీవితంలో స్థిరపడిన ప్రతి ఒక్కరి విజయం వెనుక భగవంతుని కృప ఉంటుందన్నారు. ధార్మిక సేవలో పాల్గొనడం, కార్యక్రమాలు నిర్వహించడంలో ఉండే ఆనందం అంతులేనిదని చెప్పారు. మన మనసుల్లో సానుకూలమైన దృక్పథాన్ని పెంపొందిస్తుందని శాస్త్రవేత్తలు వివిధ పరిశోధనల ద్వారా గుర్తించారని అన్నారు. అన్నదానానికి సహకరించిన దాతలు నారాయణరావు దంపతులు అభినందనీయులని అన్నారు. కార్యక్రమంలో రివర్ బ్రీజ్ అపార్ట్‌మెంట్ సభ్యులు, పలువురు ధార్మిక, ఆధ్యాత్మిక వాదులు పాల్గొన్నారు.

### భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి



ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద ప్రభుత్వం పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేయాలి. పగలయినా, రాత్రయినా డ్యూటీలు చేసే వైద్యులు, సిబ్బంది నిర్భయంగా పని చేయాలంటే భయపడుతున్నారు. సీసీ కెమెరాల నిఘా వలన కొంతవరకు నేరాలను అదుపు చేసే అవకాశం ఉంది. సెక్యూరిటీ పరంగా కూడా అందరికీ మంచిది. ప్రభుత్వాలు వైద్యులు, సిబ్బంది భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

– డాక్టర్ షాలిని, మెడికల్ ఆఫీసర్, స్వర్ణ, కారంచేడు మండలం



### పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలి



నైట్ డ్యూటీ డాక్టర్, సిబ్బందికి అవసరమైన విశ్రాంతి గదులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తే బాగుంటుంది. రాత్రిళ్లు పోలీసు పికెట్లు, లేదా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలి. పోలీస్ పెట్రోలింగ్ వలన నేరస్తులు భయపడతారు. లేకుంటే నేరస్తులకు అవకాశం ఇచ్చినట్లు అవుతుంది. నైట్ డ్యూటీ డాక్టర్‌తో పాటు, స్టాఫ్ నర్స్‌లు కూడా డ్యూటీల్లో ఉంటారు. వారికి అవసరమైన రక్షణను ప్రభుత్వం బాధ్యతగా చేపట్టాలి.

– డాక్టర్ హస్మప్రియ, స్వర్ణ పీహెచ్‌సీ, కారంచేడు మండలం

# మానవ మృగాలను కఠినంగా శిక్షించాలి

**రేపల్లెలో కదం తొక్కిన విద్యార్థులు**

**రేపల్లె రూరల్:** కళ్లు మూసుకుపోయి మహిళలు, బాలికలు చివరికి పసికూనలపైనా అత్యంత పాశవికంగా అత్యాచారాలకు, హత్యలకు పాల్పడే మానవ మృగాలను అత్యంత కఠినంగా శిక్షించే విధంగా చట్టాలను చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ అన్నారు. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనకు నిరసనగా భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ), సీఐటీయూల సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థినులతో శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి అసలైన దోషులను పట్టుకుని కఠినంగా శిక్షించాలన్నారు. మహిళలకు, నిస్వార్థంగా సేవలు అందించే వైద్యులు, మహిళా సిబ్బందికి రక్షణ కల్పించేలా మరిన్ని కఠిన చట్టాలను అమల్లోకి తీసుకురావాలన్నారు. ఈ కేసులో అసలు నిందితులను అరెస్ట్ చేయటంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. ఈ కేసును సీబీఐ ఆధ్వర్యంలో త్వరితగతిన విచారణ చేసి త్వరితగతిన నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సేవ్ గాల్స్.. సేవ్ ఇండియా, నో సేఫ్టీ-నోవర్క్ అంటూ విద్యార్థులు నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. బస్టాండ్ సెంటరులో మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు కె.ఝాన్సీ, ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు వై.నవీన్, ఏలియా, నాగార్జున, నికిత, భవాని, తదితరులు పాల్గొన్నారు.



రేపల్లె బస్టాండ్ సెంటరులో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న విద్యార్థులు

**కఠిన చట్టాలతోనే అకృత్యాలకు అడ్డుకట్ట**

**బాపట్లటౌన్:** వెస్ట్‌బెంగాల్‌లోని ఆర్‌జీకర్ కళాశాలలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన దుర్ఘటనలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే కఠినమైన చట్టాలు అందుబాటులోకి ఉండాలని జిల్లా ట్రైబల్ ఫెడరేషన్ అధ్యక్షుడు దేవరకొండ రాము తెలిపారు. వైద్యురాలిపై జరిగిన దాడిని నిరసిస్తూ శనివారం రాత్రి పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి రథంబజార్, ఎంజీరోడ్, జీబీసీ రోడ్డు, గడియార స్తంభం సెంటర్ మీదుగా కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. దేవరకొండ రాము మాట్లాడుతూ మహిళలకు రక్షణ కొరవడిన కారణంగానే దేశవ్యాప్తంగా దాడులు పెచ్చిరిల్లుతున్నాయన్నారు. అసోసియేషన్ నాయకులు ఎం.రామాంజనేయులు, ఎం.సాంబయ్య, బి.రత్నరాజు, జె.శివబాబు తదితరులు పాల్గొన్నారు.



బాపట్లలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ట్రైబల్ ఫెడరేషన్ నాయకులు

# ప్రజా సమస్యలపై ఐక్యంగా పోరాడుదాం



సమావేశంలో మాట్లాడుతున్న కరణం వెంకటేష్

- ఎవరూ అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్

**చీరాల:** అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి నాయకులు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను రాష్ట్రవ్యాప్తంగా వేధిస్తున్నారని.. అయినప్పటికీ ఎవరూ అధైర్యపడవద్దని, తాము అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు చాంబర్‌లో పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. ప్రజల సమస్యలపై పోరాడాలని, చీరాల నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. అమలుకాని హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని నెరవేర్చకుండా కేవలం వైఎస్సార్ సీపీ నేతలను వేధించి వారి ఆస్తులను ధ్వంసం చేసే కార్యక్రమం చేస్తోందని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వానికి తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళలకు మూడు సిలిండర్లు వంటి సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసే ఉద్దేశం లేకపోగా ప్రజలను దారి మళ్లించేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. చీరాల మున్సిపాలిటీలో కౌన్సిల్‌లో మెజార్టీ ఉన్నామని పట్టణాభివృద్ధి కోసం అంతా కలిసి పనిచేయాలన్నారు. ఇటువంటి పరిస్థితుల్లోనే అంతా కలిసి కట్టుగా ఉంటే పార్టీ బలోపేతం అవుతుందని పిలుపునిచ్చారు. ఎవరికి భయపడాల్సిన అవసరం లేదని, అటువంటి పరిస్థితులు ఉంటే పార్టీ నాయకులు, కార్యకర్తలకు తాము అండగా నిలుస్తామన్నారు. మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపాలిటీలో కమిషనర్ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కౌన్సిల్ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఆయన సొంత నిర్ణయాలు తీసుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణంలో ఫ్లెక్సీలు తొలగించాలని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ సర్క్యులర్ జారీ చేసినప్పటికీ చీరాలలో ఫ్లెక్సీలు తొలగించడకుండా తాత్సారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కమిషనర్‌పై చర్యలు తీసుకునేందుకు తాము కలిసి పోరాడతామన్నారు. వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, కౌన్సిలర్లు గుంటూరు ప్రభాకరరావు, కీర్తి వెంకట్రావు, బత్తుల అనిల్, కంపా అరుణ్, తోకల అనిల్, కో-ఆప్షన్ సభ్యులు షేక్ కబీర్, పార్టీ నాయకులు శిఖా సురేష్, గవిని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## రంగస్థల నటి బండారు పద్మ మృతి



బండారు పద్మ (ఫైల్)

**అద్దంకి:** ప్రఖ్యాత కళాకారుడు అద్దంకి వాసి బండారు రామారావు, సుశీల కుమార్తె అయిన రంగస్థల నటి, రేడియో ఆర్టిస్టు బండారు పద్మావతి (59) మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. గత కొన్నాళ్లుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఆమె శనివారం ఆమె నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో తుదిశ్వాస విడిచారు. చంద్రమతి, శ్రీ కృష్ణుడు, నాయకురాలు నాగమ్మ, చింతామణి, తదితర పాత్రలకు పద్మ వన్నె తెచ్చారు. ఇలా 2 వేలకు పైగా స్టేజీ ప్రదర్శనలు ఇచ్చి తండ్రికి తగ్గ తనయగా గుర్తింపు తెచ్చుకున్నారు. పలువురు కళాకారులు, అభిమానులు, స్థానికులు సంతాపం వ్యక్తం చేశారు.

## ఆత్మహత్యకు యత్నించిన వృద్ధురాలు

**కొల్లూరు:** అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ వృద్ధురాలు కాలువలో పడి బలవన్మరణానికి యత్నించిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కొల్లూరు గౌడపాలెంకు చెందిన మర్గాన నాగేంద్రం కొన్నేళ్లుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుంది. ఇటీవల వ్యాధి సమస్య అధికమవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంది. వ్యాధికారణంగా పడుతున్న బాధలు తాళలేక ఆత్మహత్యకు యత్నించింది. స్థానిక ప్రభుత్వ కార్యాలయాల సమీపంలోని పశ్చిమ బ్యాంక్ కెనాల్‌కు ఉన్న స్నానాల రేవు ర్యాంపు వద్ద నుంచి కాలువలోకి దిగే ప్రయత్నం చేస్తుండటాన్ని గమనించిన స్థానికులు ఆత్మహత్యకు పాల్పడకుండా అడ్డుకున్నారు. అనంతరం ఆమెను పక్కన ఉన్న వినాయకుని గుడి వద్దకు చేర్చి పోలీసులకు సమాచారం అందించారు. హెడ్ కానిస్టేబుల్ ఎం.శ్రీను సంఘటనా ప్రాంతానికి వెళ్లి ఆమెకు నచ్చచెప్పి కుటుంబ సభ్యులను పిలిపించి వారి సాయంతో ఆమెను ఇంటికి పంపిచారు.

## ఇసుక అక్రమ రవాణా నిరోధానికి పటిష్ట చర్యలు

- తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు
- 2056 మెట్రిక్ టన్నుల ఇసుక గుట్టలు, రెండు పడవలు సీజ్



విలేకరులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు, పక్కన ఎస్ఐ శివయ్య

**భట్టిప్రోలు:** ఇసుక అక్రమ రవాణాకు కళ్లెం వేసేందుకు పటిష్ట చర్యలు చేపట్టామని భట్టిప్రోలు తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎస్ఐ ఎం.శివయ్యతో కలసి తహసీల్దార్ విలేకర్లతో మాట్లాడారు. భట్టిప్రోలు మండలంలో ఓలేరు, పెదలంక కాకుల డొంక రేవుల నుంచి ఇసుక తరలించేందుకు ఎటువంటి అనుమతులు లేవని చెప్పారు. ఆయా రీచ్‌ల పరిధిలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి రౌండ్ ది క్లాక్‌గా ఆయా శాఖల సిబ్బందికి డ్యూటీలు వేయనున్నట్లు తెలిపారు. వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, మహిళా పోలీసులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఓలేరు సమీపంలోని తూర్పుపాలెంలో శుక్రవారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు రెవెన్యూ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, మైనింగ్, సెబ్, పోలీస్ సిబ్బంది కలసి నాలుగు టీమ్‌లుగా అక్కడకు వెళ్లినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అక్కడ 2056 మెట్రిక్ టన్నుల మూడు ఇసుక గుట్టలు, రెండు పడవలను గుర్తించి సీజ్ చేసి రెవెన్యూ శాఖకు అప్పగించినట్లు చెప్పారు. టైరుబండ్ల దారులు అనుమతి ఉన్న కొల్లూరు మండలం జువ్వలపాలెం రీచ్ నుంచి మాత్రమే ఇసుకను తరలించుకోవాలని సూచించారు. ఎస్ఐ శివయ్య మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పని చేసి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఎక్కడైనా ఇందుకు సంబంధించి సమాచారం ఉంటే ఆయా శాఖలకు తెలియచేయాలని వారి పేర్లను గోప్యంగా ఉంచడం జరుగుతుందని వివరించారు.

## పట్టపగలే తాళం వేసిఉన్న ఇంట్లో చోరీ

**నగదు, బంగారం, టీవీ అపహరణ**



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

**వేటపాలెం:** ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఇంట్లో పట్ట పగలే చోరీ జరిగింది. దొంగలు ఇంటి తాళం పగలగొట్టి విలువైన సొత్తుతో పరారయ్యారు. చల్లారెడ్డిపాలెం పంచాయతీ, కొత్తపాలెం రోడ్డులో దత్త క్షేత్రం పక్కన దత్తాత్రేయ కాలనీలో శుక్రవారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ప్రధాన రోడ్డు పక్కన బి.నాగమణి అనే మహిళ అద్దె ఇంట్లో ఒంటరిగా నివసిస్తోంది. కుమారుడు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తుంటాడు. నర్సుగా పనిచేసే నాగమణి రోజూ ఒంగోలులోని జీజీహెచ్‌లో విధుల నిమిత్తం నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రోజూ బస్‌లో ఒంగోలు వెళ్లి సాయంత్రం తిరిగి వస్తుంటారు. కాగా శుక్రవారం కూడా అలాగే వెళ్లి తిరిగి సాయంత్రం 7 గంటలకు ఇంటికి చేరుకున్నారు. ఇంటివచ్చి చూడగా.. ఇంటి తాళం బ్లేడుతో కోసిఉండడంతో పాటు ఇంట్లోని బీరువా తెరిచిఉంది.. అందులో దాచి ఉంచిన రూ. 50 వేలు నగదు, రెండున్నర సవర్ల బంగారు గొలుసు, ఎల్‌సీడీ టీవీని దొంగలు ఎత్తుకెళ్లినట్లుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఎం.వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. శనివారం క్లూస్ టీం బృందం వచ్చి వేలిముద్రలు సేకరించింది.

**ఎమ్మెల్యే హాజరైన రోజే ఘటన..**

అయితే ఘటన జరిగిన రోజు ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఆ ఇంటి ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్కూల్‌లో సరస్వతీ దేవి విగ్రహావిష్కరణకు స్థానిక ఎమ్మెల్యే హాజరయ్యారు. అదే సమయంలో చోరీ జరగడంపై స్థానికులు విస్మయం చెందుతున్నారు. కొణిజేటి నగర్ కాలనీలో అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కాగా కొణిజేటి చేనేత పురి కాలనీలో రెండు నెలల క్రితం ఇదే తరహాలో తాళం వేసి కూలి పనులకు వెళ్లిన రెండు ఇళ్లలో పట్ట పగలు చోరీకి పాల్పడ్డారు. అలాగే కాలనీలో ఇంటి బయట ఉన్న మోటార్లు సైతం చోరీకి గురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

**జూనియర్ సివిల్ జడ్జి కేవీవీ సత్యనారాయణ**



లోక్ అదాలత్ గురించి మాట్లాడుతున్న న్యాయమూర్తి

**గురజాల:** సెప్టెంబర్ 14వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి కేవీవీ సత్యనారాయణ కోరారు. స్థానిక కోర్టు భవనాలలో పోలీస్‌లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజీ పడదగిన సివిల్, క్రిమినల్ కేసులు ఉంటే సత్వరమే కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

**సబ్‌జైలును తనిఖీ చేసిన జూనియర్ సివిల్ జడ్జి**

స్థానిక సబ్ జైలును జూనియర్ సివిల్ జడ్జి కేవీవీ సత్యనారాయణ శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్‌జైలులో ఉన్న వంట గది, పరిసరాలను పరిశీలించారు. భోజనం, మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయా లేదా అని ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలు ఉచిత న్యాయ సలహా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజీ పడదగిన కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు.